సమస్యల పరిష్కారానికి కృషి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: స్థానిక సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని కార్పొరేటర్ కంది శైలజ తెలిపారు. గురువారం ఆమె డివిజన్ పరిధిలోని అంబర్‌నగర్ శకుంతల స్కూల్ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. అందులో భాగంగా రూ.29 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బెజ్జంకి రాజేష్, జగదీష్, స్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లు, పిచ్చి మొక్కల తొలగింపు



నార్తలాలాగూడలోని శ్మశాన వాటికను
శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: దీపావళి పండుగను పురస్కరించుకుని స్మశాన వాటికలో పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కల్ని తొలగించి శుభ్రం చేయిస్తున్నట్లు కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె నార్తలాలాగూడ ఇంద్రనగర్‌లోని సత్య హరిశ్చంద్ర శ్మశాన వాటిక పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం శ్మశాన వాటికలో సమాధుల చుట్టూ పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కల తొలగింపు పనులను ప్రారంభించారు. దీపావళి సందర్భంగా సమాధుల వద్ద పూజలు నిర్వహించుకోవడానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, శ్రీనివాస్‌గౌడ్, దాసరి శ్రీను, అమర్, ఎల్లయ్య, దేవయ్య, మహేందర్, హన్మంతు, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్-2024 కన్వీనర్‌పై చర్యలు తీసుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఐసెట్-2024 కన్వీనర్ నరసింహాచారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.బాలక్రిష్టా రెడ్డిని కలిసి ఐసెట్ కన్వీనర్‌ను తొలగించాలని వినతి పత్రాన్ని అందజేసినట్లు పీడీఎస్‌యూ నాయకులు ఎస్.నాగేశ్వర్ రావు, సుమంత్ తెలిపారు. ఉన్నత విద్య మండలి విడుదల చేసిన రూ.92.76 లక్షల నిధుల్లో నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ.30 లక్షలు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. దీనిపై న్యాయ విచారణ చేపట్టి కన్వీనర్ నరసింహాచారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఓల్డేజ్ హోంకు టీవీ విరాళం



కలర్ టీవీని అందజేస్తున్న త్రీజీ హెచ్ సర్వీసెస్ ప్రతినిధులు

రసూల్‌పురా: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా త్రీజీ హెచ్ సర్వీసెస్ ప్రతినిధులు గురువారం కంటోన్మెంట్ బోర్డు మూడో వార్డు లోని మడ్‌ఫోర్ట్ ఓల్డ్ ఏజ్ హోంకు కలర్ టీవీని అందజేశారు. అదేవిధంగా మహేంద్రహిల్స్ లోని అనాథ ఆశ్రమం పిల్లలకు స్కూల్ బ్యాగ్స్, మంచినీటి గ్లాసులను అందజేశారు . వృద్ధాశ్రమంలో వృద్ధులకు కాలక్షేపంకోసం కలర్ టీవీని అందజేశామని, అనాథశ్రమంలో ఉంటున్న పిల్లలకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేసినట్లు ధీరజ్‌కుమార్, శిరీష తెలిపారు. నగరంలోని పలు వృద్ధశ్రమాలు, అనాథశ్రమాల్లో ఉంటున్న వారికి తమ వంతుగా చేయూతనందిస్తున్నామని వెల్లడించారు.

అమోయ్ కుమార్‌పై ఆరోపణలు అవాస్తవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్ పై నిరాధారమైన ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు ఆయన నిదర్శనమన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అయినందునే అనేక రకాలుగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఈడీ పేరుతో అమోయ్ కుమార్ మనోస్థైర్యాన్ని దెబ్బతీయడం బాధాకరమన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పార్టీలతో సంబంధం లేకుండా బీసీ అధికారులను వేధింపులకు గురి చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పోస్టింగులు, పదోన్నతుల్లోనూ కుల వివక్ష కొనసాగుతోందన్నారు. అంతగా ప్రాధాన్యత లేని పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అధికారులను నియమించి అగ్రకుల అధికారులను ఫోకల్ పోస్టుల్లో నియమిస్తున్నారన్నారు. సామాజిక న్యాయం, బీసీ సంక్షేమం కోసం పోరాడుతున్న బీసీ సంఘాలు ఇకపై ఉన్నతాధికారుల విషయంల్లోనూ పోరాటాలు చేపడుతుందన్నారు. అమోయ్ కుమార్ పై నిరాధారమైన ఆరోపణలు ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

బీసీల ఐక్యతకు నిర్మాణాత్మక కృషి

ముషీరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీ సంక్షేమ సంఘం కమిటీలు వేసి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి కృషి చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ర్యాగ అరుణ్ తెలిపారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేనా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణాయాదవ్, వేణు, కిశోర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

దోమలగూడ డీఐగా శ్రీశైలంనాయక్

కవాడిగూడ: దోమలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా 2009 బ్యాచ్‌కి చెందిన తేజావత్ శ్రీశైలం నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఎస్సైగా సనత్‌నగర్, కుషాయిగూడ, ఎల్‌బీనగర్, నాచారం, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, కేపీహెచ్‌బీలో పనిచేశారు. చిలకలగూడ డీఐగా రాచకొండ మహేశ్వరం జోన్‌లో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన గురువారం దోమలగూడ డీఐగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసులను త్వరితగతిన పరిశీలించి శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు.

ఆస్తి పన్ను వసూలు అంతంతే..!

- నామమాత్రంగా ఆస్తిపన్ను వసూళ్లు
- కమర్షియల్ భవనాలకు సాధారణ పన్ను
- విద్యుత్ బిల్లుల ప్రాతిపదికన సర్వే శూన్యం
- లష్కర్ పన్నుల విభాగం తీరు ఇదీ..



సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయం

సికింద్రాబాద్: నియోజకవర్గ పరిధిలోని భవనాలపై సమగ్ర సర్వే నిర్వహించి ఆస్తిపన్ను రాబట్టడంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ అధికారులు విఫలం అవుతున్నారు. సిబ్బంది కొరతను సాకుగా చూపుతూ అధికారులు, ఉద్యోగులు నామమాత్రపు విధులు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తులను గుర్తించడం, వాటికి ఆస్తిపన్ను విధించడం, అనుమతి లేని భవనాలకు వంద శాతం జరిమా విధించడం వంటి అంశాలపై క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. నగరంలోని వివిధ సర్కిళ్ల పరిధిలోని అధికారులు విస్తృతంగా సర్వేలు నిర్వహించి ఆస్తిపన్ను రాబడి పెంచేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండగా ఇక్కడి అధికారులు, ఇన్‌స్పెక్టర్లు మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

విద్యుత్ బిల్లుల సర్వేలోనూ నిర్లక్ష్యం

గత నెలరోజులుగా నగర వ్యాప్తంగా ఆయా సర్కిళ్ల పరిధిలోని బిల్‌కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ఆస్తిపన్ను మదింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. జీహెచ్ఎంసీ ప్రస్తుతం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో ఆదాయ మార్గాలపై దృష్టి సారించిన జీహెచ్ఎంసీ అధికారులు ఆస్తిపన్ను మదింపుపై భారీ కసరత్తు చేస్తున్నారు. విద్యుత్ బిల్లుల ఆధారంగా వందల సంఖ్యలో భారీ భవనాలు ఉండగా ఆస్తిపన్ను మాత్రం సాధారణ భవనాలకే చెల్లిస్తున్నారు. ఒకే ప్రాంతంలోని పక్క పక్క భవనాల మధ్యే వ్యత్యాసం కనిపిస్తోంది. ఉదాహరణకు మూడంతస్తుల భవనానికి ఒక చోట రూ.5 వేల ఇంటి పన్ను వసూలు చేస్తుండగా, మరోచోట రూ.15 వేలు, అంతకంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కరెంటు బిల్లుల ఆధారంగా ఆస్తిపన్నులో సవరణలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయి. ఈ క్రమంలో సర్వేలు నిర్వహించి కమర్షియల్, రెసిడెన్షియల్ భవనాల లెక్కలు తేల్చి ఆస్తిపన్ను మదింపు చేయాల్సి ఉంది. ఇటువంటి భవనాలు 3 వేల వరకు ఉన్నట్లు విద్యుత్ బిల్లులు చెబుతున్నా ఆ దిశగా పరిశీలించి జీహెచ్ఎంసీ ఆదాయం పెంచే వారు కరువయ్యారు.

తేలని కమర్షియల్ భవనాలు

నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో సర్వేలు నిర్వహించి వాణిజ్య, రెసిడెన్షియల్ భవనాల లెక్కలు తేల్చి ఆస్తిపన్ను మదింపు చేయాల్సి ఉంది. ఇటువంటి భవనాలు 3 వేల వరకు ఉన్నట్లు విద్యుత్ బిల్లులు చెబుతున్నా ఆ దిశగా పరిశీలనలు చేసి జీహెచ్ఎంసీ ఆదాయం పెంచే వారు కరువయ్యారు. కమర్షియల్ విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న పలువురు భవన యజమానులు ఆస్తిపన్ను మాత్రం నివాస భవనం లెక్కనే చెల్లిస్తున్నారు. కమర్షియల్ కరంట్ బిల్లులు కలిగి ఉన్నవారంతా కమర్షియల్ ఆస్తి పన్ను చెల్లించాలని జీహెచ్ఎంసీ నిబంధనలు చెబుతున్నాయి. తమ జేబులు నింపుకుంటున్న ట్యాక్స్ విభాగం అధికారులు, ఉద్యోగులు పాత పద్ధతుల్లోనే ఆస్తిపన్ను వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

నామమాత్రపు వసూళ్లు....

సికింద్రాబాద్ సర్కిల్‌లో ప్రభుత్వ భవనాలు కలుపుకుని మొత్తంగా 55 వేల భవనాల నుంచి రూ.108కోట్ల ఆస్తిపన్ను బకాయిలు రావాల్సి ఉంది. గత ఏడాది కేవలం రూ.16 కోట్లు ఆస్తిపన్ను వసూలు చేసిన అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (వచ్చే ఏడాది మార్చి నాటికి) రూ.25 కోట్ల వసూలుతో సరిపెట్టుకోవాలని ట్యాక్సు విభాగం అధికారులు టార్గెట్‌గా పెట్టుకోవడం గమనార్హం. అదనపు విధులు ఉన్నాయంటూ అటు వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉండక, ఇటు నిర్దేశిత ప్రాంతాల్లో పర్యటనలు చేయక అధికారులు, సిబ్బంది తమకు అవసరమైన పనుల సందర్భంలో మాత్రమే అందుబాటులో ఉంటున్నట్లు సమాచారం.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం

ఆస్తిపన్ను వసూలు ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కరెంటు బిల్లుల ప్రాతిపదికన కమర్షియల్ భవనాల పరిశీలన కార్యక్రమం కొనసాగుతుంది. అదనపు విధుల ప్రాతిపదికన కొద్ది రోజులుగా కమర్షియల్ భవనాల పరిశీలన కార్యక్రమానికి అంతరాయం కలిగింది. కొద్ది రోజుల్లో వేగవంతం చేస్తాం. ఆస్తిపన్న మదింపు విషయంలో అవకవతకలు జరిగితే అందుకు బాధ్యులైన అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకుంటాం.

– డీసీ సుభాష్‌రావు

మురుగునీటి సమస్య పరిష్కారానికి కృషి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో కలుషిత నీటి సమస్య నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి మహ్మద్ గూడ ప్రాంతంలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కుంటున్న సమస్యలు వివరించారు. మహ్మద్ గూడలోని జమ్‌జమ్ ఫంక్షన్ హాల్ ఎదుట తరచూ మురుగు నీరు ఉప్పొంగుతూ ఉండడంతో ప్రధాన రోడ్డు జలమయమవుతుందన్నారు. కార్పొరేటర్ సామల హేమ స్థానికులు ఎదుర్కుంటున్న సమస్యలు ఎండీ దృష్టికి తెచ్చారు. ప్రధాన రహదారి పరిసర ప్రాంతాల ప్రజల ఇబ్బందులు తొలగించడం కోసం ఈ ప్రాంతంలో నూతన పైప్ లైన్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి సీతాఫల్‌మండి ప్రాంత ప్రజలు ఎదుర్కుంటున్న మురుగునీటి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి త్వరితగతిన కొత్తపైప్ లైన్ల నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి చీఫ్ జనరల్ మేనేజర్ ప్రభు గుప్త, జనరల్ మేనేజర్ వినోద్, మేనేజర్లు ప్రియాంక, నవ్య, బీఆర్ఎస్ నాయకుడు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ లైబ్రరీలో ఐక్యరాజ్య సమితి దినోత్సవం



ఓయూ లైబ్రరీ సిబ్బందితో వీసీ ప్రొ.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ లైబ్రరీలో ఐక్యరాజ్య సమితి 79వ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. గురువారం లైబ్రరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చీఫ్ లైబ్రరీయన్ డా. అచల మునిగల్ అధ్యక్షత వహించగా వీసీ ప్రొ.కుమార్ ముఖ్య అతిథిగా అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు వీసీ ప్రొ.కుమార్ లైబ్రరీలో పర్యటించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారం రోజుల పాటు నిర్వహించనున్న పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమంలో యూజీసీ డీన్ ప్రొ.మల్లేశంతో పాటు అధ్యాపకులు డా.యాదగిరి, డా.చక్రవర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రియాంకా గాంధీ ఓటమికి కేరళలో ప్రచారం



ప్రొ.గాలి
వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రియాంకా గాంధీకి వ్యతిరేకంగా కేరళలో ప్రచారం చేయనున్నట్లు సౌతిండియా పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఓయూ న్యాయకళాశాల విశ్రాంత అధ్యాపకులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేరళలోని వయనాడ్ పార్లమెంట్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రియాంకా గాంధీని ఓడించి స్థానిక (కేరళ రాష్ట్రం) అభ్యర్థుల గెలుపు కోసం తెలంగాణ నుంచి సౌతిండియా పొలిటికల్ జేఏసీ బృందం ప్రచారం చేస్తుందన్నారు. దేశాన్ని పాలించిన ఉత్తరాది నాయకులు దక్షిణ భారత్ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. అంబేడ్కర్ పేర్కొన్నట్లు హైదరాబాద్‌ను దేశ రెండో రాజధాని చేయలేదని, సుప్రీం కోర్టు బెంచ్ దక్షిణాదిలో ఏర్పాటు చేయలేదని, సివిల్స్ ఉద్యోగాల్లో అన్యాయం, యూజీసీ నెట్ ఫలితాల్లో తక్కువ మందికి అర్హత, ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపనలో వివక్షతో పాటు కేంద్ర బడ్జెట్‌లో దక్షిణ రాష్ట్రాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలతో సంబంధం లేకుండా ఉత్తరాది నాయకులు దక్షిణాదిన పోటీ చేస్తే వారి ఓటమి కోసం ప్రచారం చేసి నిరసన తెలుపుతామని ప్రొ.గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. డివిజన్ పరిధిలోని మహ్మద్‌గూడతోపాటు పలు రహదారులపై మురుగునీరు వరదలై పారుతున్నా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గురువారం మహ్మద్‌గూడతోపాటు డివిజన్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాలను బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రజలు తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పరిష్కరించడం లేదన్నారు. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మురికి నీరు, డ్రైనేజీ నీరు మంచినీటి పైపులైన్లలో కలవడం వల్ల అనేకమంది అనారోగ్యం పాలవుతున్నారన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో మురునీటి సమస్యలపై జలమండలి ఎండీకి ఫిర్యాదు చేసిన ఫలితంగా అధికారుల్లో స్పందన వచ్చిందన్నారు. డివిజన్ పరిధిలోని మురుగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను కోరామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు దేవుడు కుమార్ ఈఎల్ ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ మహాధర్నాను విజయవంతం చేయాలి

చిక్కడపల్లి: మూసీ బాధితులకు అండగా శుక్రవారం ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న బీజేపీ మహాధర్నాను విజయవంతం చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయకుమార్ పిలుపునిచ్చారు. గురువారం డివిజన్‌లోని అరుంధతినగర్, సబర్మతినగర్‌లలో బీజేపీ నాయకులతో కలసి ఆయన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ... కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ మహాధర్నా జరుగుతోందన్నారు. గాంధీనగర్ డివిజన్ నుంచి మూసీ బాధితులు, ప్రజలు అధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, ఆనంద్‌రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కూల్చివేతలను పర్యవేక్షిస్తున్న బోర్డు చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్ తదితరులు

రసూల్‌పురా: ఆలస్యంగా నిద్ర మేల్కొన్న కంటోన్మెంట్ బోర్డు ఇంజినీరింగ్ అధికారులు ఎట్టకేలకు అక్రమ నిర్మాణాల కూల్చివేతలు ప్రారంభించారు. గురువారం బోర్డు పరిధిలోని 8వ వార్డు రిసాలాబజార్‌లో వినోద్‌కుమార్ జైన్ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఇంజినీర్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ వినోద్ కుమార్ జైన్ కంటోన్మెంట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మూడవ అంతస్తు నిర్మిస్తుండడంతో కూల్చి వేశామన్నారు. ఇకపై నిరంతరం అక్రమ నిర్మాణాలను గుర్తించి నోటీసులిచ్చి అనంతరం కూల్చివేస్తామని హెచ్చరించారు. కంటోన్మెంట్‌లో నిరంతరం అక్రమ నిర్మాణాలపై నిత్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ టౌన్‌ప్లానింగ్ అధికారి ఫణికుమార్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు రాజేశ్వర్, కృష్ణసాగర్, కృష్ణకాంత్ రెడ్డి, తరుణ్ రెడ్డి, శివాజీ, ఆశీష్ పాల్గొన్నారు.

ఆటపై ప్రై‘వేటు’..

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి అమీర్‌పేట క్రీడాసౌధం..?

- ఆ దిశగా ఉన్నతాధికారుల సన్నాహాలు
- టెండర్లకు ఆహ్వానం..
- దశాబ్దాలుగా నిరుపేద క్రీడాకారులను
- తీర్చిదిద్దుతున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్..
- ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి వెళితే
- ఫీ'జులుం' తప్పదేమోనని ఆందోళన..



అమీర్‌పేట డీకేరోడ్డులో స్పోర్ట్స్ కాంప్లెక్స్..

సనత్‌నగర్: ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత చదువులు చదవలేక..తాము ఎంచుకున్న క్రీడలో రాణించి స్పోర్ట్స్ కోటాలో భవిష్యత్తులో ఎలాగైనా సర్కార్ కొలువు సాధించాలనుకునే వారు ఎందరో. ఇక శారీరక ఆరోగ్యానికి క్రీడలనే ఆయుధంగా మలచుకునేందుకు మరెందరో..గేమ్స్‌పై పట్టు సాధించి వ్యక్తిగతంగానే కాకుండా జిల్లా, రాష్ట్ర, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలనే కసితో కసరత్తు చేసేవారు ఇంకెందరో..వీరంతా జీహెచ్ఎంసీ నిర్వహణలో కొనసాగుతున్న అమీర్‌పేట డీకేరోడ్డులోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా నామమాత్రపు ఫీజుతో ఆయా క్రీడల్లో ప్రాక్టీస్ చేస్తూ తమ లక్ష్యాలను చేరుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. అయితే ఉన్నట్లుండి ఈ క్రీడా సౌధం నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే యోచనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే క్రీడా కాంప్లెక్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే పనిలో భాగంగా భవనానికి రంగులు వేస్తున్నారు. టెండర్లను కూడా ఆహ్వానించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు సామాన్య, మధ్యతరగతి వర్గాలకు అందుబాటులో ఉండే ఫీజులు కాస్తా ప్రైవేటు వ్యక్తులకు నిర్వహణను అప్పగిస్తే మరింత ఆర్థిక భారం తప్పదని బావిస్తున్నారు. దీంతో చాలా మంది క్రీడలకు దూరమయ్యే అవకాశమూ లేకపోలేదన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అన్ని రకాల గేమ్స్‌కు అనుగుణంగా వసతులు కూడా ఉన్నాయని, ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిన తర్వాత కొత్తగా చేసేదేమీ ఉండదంటున్నారు. అవసరమైన పరికరాలను సమకూర్చేందుకు జీహెచ్ఎంసీకి అంతభారం కాదని, ఈ నేపథ్యంలో ప్రైవేటు నిర్ణయం తీసుకోవడంపై క్రీడాకారులు మండిపడుతున్నారు.

అయోమయంలో కోచ్‌లు ఆందోళనలో క్రీడాకారులు..

క్రీడా సౌధం నిర్వహణ మొత్తం ప్రైవేటు వ్యక్తులకు అప్పజెబితే తమ భవితవ్యం ఏమిటని కోచ్‌లు అయోమయంలో పడ్డారు. ఒక్క స్విమ్మింగ్‌కే ఐదుగురు కోచ్‌లతో పాటు బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్, స్కేటింగ్, యోగ, జిమ్నాస్టిక్, కరాటే, జిమ్ తదితర క్రీడాంశాల్లో నిపుణులైన కోచ్‌లు ఉన్నారు. వీరి పర్యవేక్షణలో ప్రతిరోజూ వందలాది మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలోకి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహణ బాధ్యతలు వెళితే.. తమను కొనసాగిస్తారా? లేదా? అన్న మీ మాంసలో పడ్డారు. ఒకవేళ కొనసాగించినా భవిష్యత్తులో పొమ్మనలేక పొగ పెట్టేలా వ్యవహరిస్తారా? అన్న సందిగ్ధంలో కూడా ఉన్నారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ నిబంధనల మేరకు విధులు నిర్వహిస్తూ ఆయా క్రీడల్లో శిక్షణ ఇస్తూ వచ్చిన కోచ్‌లు..ప్రైవేటు వ్యక్తులు ఎలాంటి నిబంధనలు విధిస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొందంటూ పలువురు కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఉపాధి ఉంటుందా? ఊడుతుందా? అంటూ ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా క్రీడాకారులు సైతం నామమాత్రపు ఫీజుతో వివిధ క్రీడాంశాల్లో తర్ఫీదు పొందుతుండగా, నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన తర్వాత ఏ మేర పెంచుతారోనని ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే అమీర్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కొనసాగుతున్న యోగా హాల్ స్థానంలో షూటింగ్‌లో శిక్షణ కోసం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు పనులు కూడా జరుగుతున్నాయి. షూటింగ్‌లో శిక్షణ కోసం ఏకంగా రూ.5,000 ఫీజుగా నిర్ణయించేశారు. షూటింగ్ తరహాలోనే మిగతా క్రీడల ఫీజులు కూడా అంత మొత్తానికి పెంచుతారని, అలాంటప్పుడు సామాన్య, మధ్యతరగతి వర్గాలు అంత పెద్ద మొత్తంలో ఫీజులు ఏ విధంగా చెల్లిస్తారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. వేసవికాలం వచ్చిందంటే ఉచిత శిక్షణ శిబిరాలు కొనసాగుతాయి. ఆ సమయంలో తమకిష్టమైన క్రీడల్లో విద్యార్థులు తర్ఫీదు పొందుతూ ఆటపై పట్టు సాధిస్తుంటారు. ఇకపై ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో ఉచితం అనే మాటకు ఆస్కారం ఉండదన్న వాదన కూడా వినిపిస్తోంది. వేసవికాలంలో సైతం వేలకు వేలు ఫీజులు చెల్లించి పిల్లలకు శిక్షణ ఇప్పించాల్సిన పరిస్థితులు తప్పవేమోనన్న క్రీడాకారులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటుకు అప్పగించడంపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు పునరాలోచించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.